క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ


ఎస్‌ఐ క్రాంతికుమార్

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి నూతన ఎస్‌ఐగా దగ్గుల క్రాంతికుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్‌ఐ నర్ర అంతిరెడ్డి నల్లగొండ వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. క్రాంతికుమార్ డీటీసీలో విధులు నిర్వహించి బదిలీపై నార్కట్‌పల్లికి వచ్చారు

శాలిగౌరారం ఎంపీడీఓగా జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం: శాలిగౌరారం ఎంపీడీఓగా జ్యోతిలక్ష్మి బదిలీపై వచ్చారు. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం నుంచి శాలిగౌరారంకు ఎంపీడీఓగా వచ్చారు. బుధవారం జ్యోతిలక్ష్మి బాధ్యతలు స్వీకరించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుందరయ్య తెలిపారు.

ఎమ్మెల్సీ సారయ్యకు సన్మానం

నల్లగొండ: పానగల్ శివాలయాలు, దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని మంగళవారం ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య దంపతులు దర్శించుకున్నారు. అనంతరం సారయ్యను రజక సంఘం నాయకులు శాలువా కప్పి సన్మానించారు. కొండూరు సత్యనారాయణ, చిలుక రాజు చెన్నయ్య, సతీష్ పాల్గొన్నారు.

మైల సముద్రం చెరువు నింపాలని మంత్రికి వినతి

కనగల్: ఏఎమ్మార్పీ ప్రధాన కాలువ ద్వారా కనగల్ మైల సముద్రం చెరువు నింపాలని కోరుతూ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లో మంగళవారం మాజీ సర్పంచ్‌లు కలిసి వినతిపత్రం అందజేశారు. స్పందించిన మంత్రి.. చెరువు నింపేవిధంగా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తేలకంటిగూడెం మాజీ సర్పంచ్‌లు బోగరి రాంబాబు, బిళ్లపాటి మోహన్‌రెడ్డి, నామ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

బీసీ ‘డీ’ లో చేర్చాలని..

కనగల్ : ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి ఏ లోకి మార్చాలని కోరుతూ మత్స్యశాఖ మండల చైర్మన్ బొమ్మరబోయిన భార్గవ్ మంగళవారం తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. బొమ్మకంటి శివ, వాకిటి యాదగిరి, జిల్లా శేఖర్, దోటి సురేష్, బొమ్మకంటి మహేష్, జిల్లా రవి, మోహన్, కానుగు నాగరాజు, వనం యాదగిరి, సతీష్ పాల్గొన్నారు.

ధ్వజ స్తంభాన్ని పునర్నిర్మించాలని..

చిట్యాల: గుండ్రాంపల్లి శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజస్తంభం ఈ ఏడాది మే నెలలో కురిసిన వర్షాలకు విరిగిపోయింది. దీంతో ధ్వజ స్తంభాన్ని పునర్నిర్మించాలని కోరుతూ ఆ గ్రామానికి చెందిన సీపీఎం నాయకులు మంగళవారం చిట్యాల డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల కమిటీ సభ్యుడు కత్తుల లింగస్వామి , గ్రామ శాఖ అధ్యక్షుడు కత్తుల యాదయ్య, రత్నం యాదయ్య పాల్గొన్నారు.

స్వర్గపురి వాహనం సమకూర్చాలని..

చండూరు : మున్సిపాలిటీ ప్రజలకు స్వర్గపురి వాహనం సమకూర్చాలని కోరుతూ చేనేత పరిరక్షణ సేవా సమితి, చేనేత కార్మిక సంఘం , మార్కండేయ యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. చేనేత పరిరక్షణ సేవా సమితి అధ్యక్షుడు రాపోలు ప్రభాకర్, తిరందాసు శ్రీను, కర్నాటి శ్రీనివాసులు, ఏలె శ్రీను, రాపోలు వెంకటేశం, సంగెపు శ్రీను, చెరుపల్లి కృష్ణ, గంజి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలి

నల్లగొండ టూటౌన్ : ప్రభుత్వ వసతి గృహాలు, గురుకులాల్లో నాణ్యమైన ఆహారం అందించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తిప్పర్తి: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున బుధవారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ ఎస్.రమ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిప్పర్తి, సర్వారం, గంగన్నపాలెం, ఇండ్లూరు, మర్రిగూడ, సిలార్మియాగూడెం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

శాలిగౌరారం: ఆకారం 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా బుధవారం ఆకారం, అడ్లూరు, వల్లాల, వద్దిపాముల గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీధర్ తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

పుస్తకం ఆవిష్కరణ

రామగిరి(నల్లగొండ): విద్యార్థులకు ‘విద్య పరిశోధన విధానం’ పుస్తకం మేలు చేస్తుందని ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. ఉపేందర్ అన్నారు. ఎన్జీ కళాశాల లైబ్రేరియన్ డాక్టర్ ఆనందం దుర్గాప్రసాద్ రచించిన పరిశోధన విధానం, ఉన్నత విద్యలో ఎలక్ట్రానిక్ సమాచార వనరులు పుస్తకాలను మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. డాక్టర్ ఆనంద్ దుర్గాప్రసాద్, అకడమిక్ కోఆర్డినేటర్ వెంపటి శ్రీనివాసులు, సీఓఈ బి.నాగరాజు, వివిధ సబ్జెక్టుల అసిస్టెంట్ ప్రొఫెసర్లు తదితరులు పాల్గొన్నారు.

‘భగీరథ’ నీరు అందేది ఎప్పటికి!

నేటికీ పూర్తికాని పైప్‌లైన్ పనులు
- మంచినీటి కోసం ఎదురుచూస్తున్న కట్టంగూర్ ప్రజలు
- మైనర్ రిపేర్ పనులకు దొరకని కాంట్రాక్టర్లు


ఇందిరమ్మకాలనీలో ఉత్సవ విగ్రహంలా మిషన్ భగీరథ ఓవర్‌హెడ్ ట్యాంకు

కట్టంగూర్ : ఇంటింటికి తాగునీరు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం కట్టంగూర్ మండల కేంద్రం ప్రజలకు నేటికీ దరి చేరలేదు. మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నప్పటికీ కట్టంగూర్ ప్రజలు నేటికీ మంచినీటికి నోచుకోలేదు. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ అలసత్వంతో ట్యాంకుల నిర్మాణం, పైపులైన్‌పనులు మందకొడిగా సాగి మధ్యలోనే నిలిచిపోయాయి. బిల్లులు సరైన సమయంలో మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయకుండానే వదిలివెళ్లాడు. మండల కేంద్రంలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు 3, 4, 5వ వార్డుల్లో నేటికి పూర్తికాలేదు. 1వ వార్డులో సగం వరకు పైప్‌లైన్ పనులు పూర్తయ్యాయి. పీహెచ్‌సీలో ఉన్న ట్యాంకు నుంచి మెయిన్ పైపులైను పనులు కట్టంగూర్ పెద్ద చెరువు కట్ట వరకు వేసి నిలిపివేశారు. మిగతా ట్యాంకుల పైప్‌లైన్ పనులు అస్తవ్యస్తంగా ఉండడంతో లీకేజీల కారణంగా మంచినీటి సరఫరా నిలిచిపోయింది.

నిరుపయోగంగా 5 మంచినీటి ట్యాంకులు

కట్టంగూర్ మండలంలో రూ.19.24 కోట్లతో చేపట్టిన పనులు 2020 చివరి నాటికి ట్యాంకుల నిర్మాణాల వరకు పూర్తయ్యాయి. నాటి నుంచి నేటి వరకు మంచినీరు సరఫరా చేయకపోవడంతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంకులు ఉత్సవ విగ్రహాల్లా దర్శమిస్తున్నాయి. మండల కేంద్రంలో ఇంకా ఎన్ని రోజులకు మంచినీరు సరఫరా అవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా మంచినీరు అందించేందుకు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఇందిరమ్మ కాలనీలో, అంబేద్కర్‌నగర్ కాలనీలో, అంబటివాగు ప్రాథమిక పాఠశాలలో, సంతలో మొత్తం 5 ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించారు. ఏ ఒక్క ట్యాంకు నుంచి మంచినీటిని సరఫరా చేయకపోవడంతో ట్యాంకులన్నీ నిరుపయోగంగా మారాయి.

అస్తవ్యస్తంగా పైప్‌లైన్ పనులు

ప్రతి ఇంటికీ నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసి కొన్నిచోట్ల నల్లాలు బిగించకుండానే వదిలివేశారు. వేసిన పైపులైన్‌కు నేటికీ ట్రయల్ రన్ పనులు చేపట్టలేదు. నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు గ్రామంలో సీసీ రోడ్లు ధ్వంసం చేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులు త్వరితగతిన పూర్తిచేసి సక్రమంగా మంచినీరు అందించాలని కట్టంగూర్ ప్రజలు కోరుతున్నారు.

నేటికీ పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు



మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం సమీపంలో ఉన్న 5వ వార్డులో మిషన్ భగీరథ మంచినీరు సరఫరా చేసేందుకు నేటికి పైప్‌లైన్ ఏర్పాటు చేయలేదు. కృష్ణా జలాల ట్యాంకు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకునేందుకు ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి పైపులైన్ ఏర్పాటు చేసి నీరు సరఫరా చేయాలి.

– రెడ్డిపల్లి అండాలు, కట్టంగూర్

త్వరలోనే మంచినీరు సరఫరా చేస్తాం



మండల కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న మిషన్ భగీరథ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కింద రూ.2 లక్షల నిధులు సిద్ధంగా ఉన్నాయి. మరికొన్ని జీపీ నిధులతో మైనర్ పనులు మొదలు పెడతాం. త్వరలోనే అన్ని ట్యాంకుల ద్వారా ట్రయల్ రన్ చేసి మంచినీరు సరఫరా చేస్తాం.

– వడ్లకొండ అశోక్, పంచాయతీ కార్యదర్శి కట్టంగూర్

నోట్ పుస్తకాల పంపిణీ అభినందనీయం

- కలెక్టర్ సి.నారాయణరెడ్డి


విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులకు భారత సేవాశ్రమ సంఘం ఉచితంగా నోట్ పుస్తకాలు అందజేయడం అభినందనీయమని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం 11వ వార్డులోని కతాల్‌గూడ ప్రాథమికోన్నత పాఠశాలలో భారత సేవాశ్రమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత సేవాశ్రమ సంఘం ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి భిక్షపతి, భారత సేవాశ్రమ సంఘం కార్యదర్శి మునీశ్వరానందస్వామి, ఎంఈఓ కె.అరుంధతి, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, దండెంపల్లి సరోజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నల్లగొండ పట్టణంలోని 11వ వార్డులో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కలెక్టర్ సి.నారాయణరెడ్డికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దండెంపల్లి సత్తయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ 2013లో వార్డు పట్టణంలో విలీనమైన తరువాత ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. అర్బన్ కాలనీలో క్రీడా ప్రాంగణం అభివృద్ధి చేయాలని, ప్రత్యేక అభివృద్ధి నిధులు మంజూరు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో దండెంపల్లి సరోజ, పనస చంద్రయ్య, యాదయ్య, ఆనంద్ తదితరులు ఉన్నారు.

రైతుల సంక్షేమానికి కృషి

చిట్యాల: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చిట్యాల మండలం వెలిమినేడు సింగిల్ విండో చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి అన్నారు. రెండో విడత రైతు రుణమాఫీ కార్యక్రమంలో భాగంగా ఉరుమడ్ల గ్రామంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియా కాన్ఫరెన్స్‌లో మంగళవారం ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, రైతు సంఘం నాయకులు అద్దెల లింగారెడ్డి, కోనేటి యాదగిరి, పల్లపు బుద్ధుడు, చెరుకుపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

కేతేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రెండో విడత లక్షన్నర రూపాయల రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ కేతేపల్లిలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులు, అధికారులు సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని వీక్షించారు. మండలంలో లక్షన్నర లోపు రుణాలు తీసుకున్న రైతులు 1174 మంది ఉన్నారని అధికారులు తెలిపారు. అనంతరం రైతు వేదిక వద్ద రైతులు, కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, ట్రాన్స్‌కో ఏఈ గాబ్రియేల్ ఏఈఓ బాలరాజు పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై గళమెత్తిన ఎమ్మెల్యే వీరేశం


శాసనసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, రామన్నపేట : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను శాసనసభ సమావేశాల్లో మంగళవారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో పోచంపల్లిలో టెక్స్‌టైల్ పార్కు ప్రారంభిస్తే వెల్లంకి, సిరిపురం, బోగారం గ్రామాలకు చెందిన రెండువేల మంది చేనేత కార్మికులు పదేళ్లపాటు ఉపాధి పొందారని గుర్తు చేశారు. అనంతరం టెక్స్‌టైల్ పార్కు కనుమరుగైందని సభ దృష్టికి తీసుకొచ్చారు. త్రిఫ్ట్ ఫండ్ పథకానికి జియో ట్యాగింగ్ పెట్టడం వల్ల కొందరికే ఉపయోగపడిందన్నారు. వెల్లంకిలో రూ 20 కోట్లు, సిరిపురంలో రూ 8కోట్లు, బోగారంలో రూ 6 కోట్లు, పోచంపల్లిలో రూ 20కోట్ల విలువైన చేనేత వస్త్రాలు నిల్వ ఉన్నాయని తెలిపారు. వాటిని ప్రభుత్వం కొనుగోలు చేసి హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లుగా ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని, కార్మికులకు పని దొరుకుతుందన్నారు. పోచంపల్లి పట్టు చీరకు పేటెంట్ ఉన్నప్పటికీ గుజరాత్‌కు చెందిన జ్యోతి కాటన్ అనే కంపెనీ అదే డిజైన్ ప్రింట్ చేస్తూ రూ.300 నుంచి రూ1500 లకు అదే మార్కెట్‌కు తీసుకురావడం వల్ల పట్టు చీరలు తయారుచేసే రంగం కుదేలైందని, వారికి ఆత్మహత్యలు తప్ప మరొక మార్గం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టు చీరల పేటెంట్ హక్కు కాపాడాలని, డిజైన్ కాపీ కొట్టే జ్యోతి కాటన్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. రైతు రుణమాఫీ మాదిరిగానే చేనేతలకు సంబంధించిన రూ.50 వేల కోట్ల రుణాలను మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. చేనేత సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, వస్త్ర నిల్వలు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

రుణమాఫీ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి


మునుగోడు: మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

మునుగోడు: రుణమాఫీ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం మునుగోడులో జరిగిన బీజేపీ మండల ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కొందరికి మాత్రమే రుణమాఫీ చేసి చేతులు దులుపుకుంటోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, ఉపాధ్యక్షుడు దర్శనం వేణు, జిల్లా కార్యదర్శి బొడిగే అశోక్, పులకరం సైదులు, భవనం మధుసూదన్‌రెడ్డి, కాసాల జనార్దన్‌రెడ్డి, బండారి యాదయ్య, పగిళ్ల భిక్షం, బొడ్డు నాగరాజుగౌడ్, కర్నాటి లింగయ్య, పందుల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పదవే అడ్డు వస్తుందా

చండూరు : అభివృద్ధి చేయాలని తపన ఉంటే ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవే అడ్డు వస్తుందా అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి ప్రశ్నించారు. చండూరులో మంగళవారం జరిగిన పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్ల వారీగా అభ్యర్థులను సిద్ధం చేయాలన్నారు. అసెంబ్లీ కన్వీనర్ దూడల భిక్షం, జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నరసింహ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, అసెంబ్లీ కో కన్వీనర్ కాసాల జనార్దన్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధులు బొమ్మరగోని రాజు, నకరికంటి లింగస్వామి, సోషల్ మీడియా కన్వీనర్ మాదగోని నాగార్జున, ఏనుగు వెంకట్ రెడ్డి, బొబ్బల మనోహర్‌రెడ్డి, పిన్నింటి నరేందర్ రెడ్డి, యాదగిరి, మండల ప్రధాన కార్యదర్శి శివర్ల యాదయ్య, బోయపల్లి సాయి, నల్ల శ్రీను, మర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిగులు భూములు పంచాలని ధర్నా


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

పానగల్: ప్రభుత్వ మిగులు భూములను పేదలకు పంచాలని కోరుతూ మంగళవారం కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రవణ్‌కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఉపాధి హామీ కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. దివ్యాంగుల ఆసరా పింఛన్లు పెంచుతామన్న హామీ నెరవేర్చాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజువారీ వేతనం రూ.700 వచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంగలయ్య, ఊశయ్య, వేముబుచ్చయ్య, కాగితపు వెంకన్న, పెంటయ్య, హుస్సేన్, సంజీవ, వి.రమేష్, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల వేడుకలు


బోనాలతో వస్తున్న విద్యార్థులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని విపస్య పాఠశాలలో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డప్పుచప్పుళ్లతో బోనం మోసుకుంటు ప్రదర్శన నిర్వహించారు. అమ్మవారికి బోనాలు సమర్పించి పూజలు చేశారు. ప్రిన్సిపాల్ గోపాల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరిస్తాం

మునుగోడు: మండల కేంద్రంలో నెలకొన్న మురికి నీటి నిల్వ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని పంచాయతీరాజ్ డీఈ నాగేశ్వర్‌రావు అన్నారు. స్థానిక జర్నలిస్టు కాలనీతోపాటు వివిధ కాలనీల్లో నిల్వ ఉన్న నీటిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాక్షి దినపత్రికలో వచ్చిన కథనాలతోపాటు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నీటి నిల్వలను ఊరి బయటకు పంపేందుకు ప్రణాళిక సిద్ధం చేసేందుకు పరిశీలిస్తున్నామన్నారు. అదేవిధంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మరుగుదొడ్లు, తరగతి గదుల ఎదుట స్టేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈ సతీష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మిర్యాల వెంకన్న, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అన్వర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పాల్వాయి జితేందర్‌రెడ్డి ఉన్నారు.

పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్ల అరెస్టు


కనగల్ : పోలీసుల అదుపులో కార్మికులు

నకిరేకల్ : తమ వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి వెళ్లనున్నారనే సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయినవారిలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక, సబిత, మంజు, సీఐటీయూ నాయకులు వంటెపాక వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

చిట్యాల: ఆశా వర్కర్స్, గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లకుండా ఉండేందుకు మంగళవారం సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్స్, గ్రామ పంచాయతీ కార్మికులను ముందస్తుగా చిట్యాల పోలీసులు అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి మంకాల బాలమ్మ, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు పోశబోయిన సైదమ్మ, మంకాల పద్మ, జయమ్మ, సునిత, శైలజ, లింగస్వామి, గణేష్, యాదయ్య, రమేష్, జంగయ్య ఉన్నారు.

కేతేపల్లి: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్న మండలంలోని పంచాయతీ కార్మికులు, ఆశావర్కర్లను మంగళవారం ఉదయం కేతేపల్లి పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌ను తరలించారు. అరెస్టయినవారిలో సీఐటీయూ మండల కార్యదర్శి ఆదిమళ్ల సుధీర్, పంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్లు గండమళ్ళ ఆశీర్వాదం, ఏడాకుల కోటయ్య, మాందాసు సైదులు, కోట లక్ష్మి, మట్టి సునీత, పద్మ, మంజుల తదితరులు ఉన్నారు.

కట్టంగూర్ : గ్రామ పంచాయతీ వర్కర్లు, ఆశా కార్యకర్తలు చలో అసెంబ్లీ కార్యక్రమం వెళ్లకుండా అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో సీఐటీయు జిల్లా కమిటీ సభ్యుడు పెంజర్ల సైదులు చిత్తలూరి జానకిరాములు, కట్ట బక్కయ్య, ఆశావర్కర్‌లు ఉన్నారు.

శాలిగౌరారం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద మంగళవారం నిర్వహించతలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా గ్రామపంచాయతీ కార్మికులు, ఆశావర్కర్లను మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

మర్రిగూడ : ఆశా, గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న కార్మికులను, సీఐటీయూ నాయకులను మర్రిగూడ పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో ఆశా, పంచాయతీ కార్మికులు ఉన్నారు.

కనగల్ మండలంలో..

కనగల్ : చలో హైదరాబాద్ వెళ్తున్న గ్రామపంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయినవారిలో సంఘం మండల అధ్యక్షుడు జిల్లా విజయ, కట్ట శ్రీనివాస్‌రెడ్డి, కొంగల నరసింహ, కొంగల పాండు, శంకర్, దుబ్బ రవి, శివ, శంకర్ ఉన్నారు.

ముందస్తు అరెస్టులపై ఖండన

నల్లగొండ టౌన్ : గ్రామపంచాయతీ కార్మికులు, ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం ఇందిరా పార్కు వద్ద జరిగే ధర్నాకు వెళ్తున్న ఆయా సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడంపై సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తున్న వారిని గత ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పోరాటాలు చేయకుండా అరెస్టు చేస్తోందని విమర్శించారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి


నల్లగొండ టౌన్ : మాట్లాడుతున్న నెల్లికంటి సత్యం

నల్లగొండ టౌన్ : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్నారని, వారిలో అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, కొత్త రేషన్ కార్డులను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. మల్లెపల్లి ఆదిరెడ్డి, పబ్బు వీరస్వామి, గాదె రమేష్, లేనిన్ కెఎస్ రెడ్డి, ముత్యాలు, అబ్రహం, మదార్, సుజాత, యాదగిరి, కౌసల్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

కనగల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం జి.పెద్ద నరసింహ అధ్యక్షతన జరిగిన దర్వేశిపురం గ్రామశాఖ సీపీఐ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా రైతభరోసా పథకం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి, మండల కార్యదర్శి గంట సత్యనారాయణ, జినుకుంట్ల సోమయ్య, లింగయ్య, ఆంజనేయులు, సూరయ్య, గట్టిగుండ్ల నరసింహ, నాగయ్య, ఎల్లయ్య, చిలకరాజు రాములు పాల్గొన్నారు.

గోరింటాకు పండుగ


నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల శ్రీకృష్ణ ఆలయంలో మంగళవారం గోరింటాకు పండుగ ఘనంగా నిర్వహించారు. మహిళలు ఒక్కచోట చేరి గోరింటాకు నూరి చేతులకు పెట్టుకున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

అన్న ప్రసాద వితరణ

నల్లగొండ టూటౌన్ : లయన్ వనమా శ్రవణ్ తన జన్మదినం సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ నల్లగొండ చాలెంజర్స్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు, వారి సహాయలకు అల్పాహార విరతణ చేశారు. అదేవిధంగా గోగికార్ గంగాకిషన్ వర్ధంతి సందర్భంగా వారి కుమారుడు జవహర్‌లాల్ అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్ సతీష్‌కోడె, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నవ్య క్లబ్ ఆధ్వర్యంలో నకిరేకల్‌లోని ఏరియా ఆస్పత్రిలో మంగళవారం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో చాప్టర్ ప్రెసిడెంట్ కందాల పాపిరెడ్డి, డీసీ సూర్యకుమార్, నవ్య క్లబ్ అధ్యక్షురాలు ఎన్.రమాదేవి, ప్రతినిధులు యల్లపురెడ్డి యాదగిరిరెడ్డి, రఘునమ్మ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

మునుగోడు: రత్తిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాజీ సర్పంచ్ మాదగోని రాజేష్‌గౌడ్ పండ్లు, న్యూట్రిషన్ ఫుడ్ పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు నర్సిరెడ్డి, ఉపాధ్యాయురాలు అయేషా ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్: కల్లు గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 2 నుంచి 18 వరకు జరిగే గీతన్నల చైతన్య యాత్ర జయప్రదం చేయాలని కోరుతూ మంగళవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో సంఘం నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. వచ్చే నెల 2న బొల్లగాని పుల్లయ్య వర్ధంతి నుంచి 18న సర్వాయి పాపన్న జయంతి వరకు చైతన్య యాత్రలు జరుగుతాయన్నారు. వేములకొండ పుల్లయ్య, గోపాల్, అంజయ్య, వెంకట్‌గౌడ్, మక్తాల లింగస్వామి, ధనుంజయ, దండంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

నాన్ డొమెస్టిక్ సిలిండర్లు సీజ్

నల్లగొండ: ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ అధికారులు మంగళవారం నల్లగొండలో పలు షాపులపై దాడులు చేసి నాన్ డొమెస్టిక్ సిలిండర్లు సీజ్ చేశారు. దాడుల్లో భాగంగా సువర్ణ కేటరింగ్ షాపును తనిఖీ చేశారు. కమర్షియల్ సిలిండర్లకు బదులుగా నాన్ డొమెస్టిక్ సిలిండర్లను వాడుతుండడంతో వాటిని సీజ్ చేశారు. మొత్తం 8 నాన్ డొమెస్టిక్ సిలిండర్లను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ అధికారులు తెలిపారు.

‘చలో ఢిల్లీ’ పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆగస్టు 6,7వ తేదీల్లో తలపెట్టిన పార్లమెంట్ ముట్టడిని జయప్రదం చేయాలని సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను గడియారం సెంటర్‌లోని పూలే విగ్రహం వద్ద ఆవిష్కరించారు.

మాతృత్వంపై అవగాహన

నల్లగొండటౌన్: మహిళలకు మాతృత్వంపై అపోహలు ఉండొద్దని డాక్టర్ పద్మ అన్నారు. మంగళవారం స్థానిక పద్మ హాస్పిటల్ లో మ్యాన్ కైండ్ ఫార్మా ఆధ్వర్యంలో మహిళలకు మాతృత్వంపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భధారణలో సహాయపడే కొత్త శాస్త్రీయ వాస్తవాలు, అడ్డంకులను అధిగమించడానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

ట్రాక్టర్ బ్యాటరీల చోరీ

శాలిగౌరారం: మాధారంకలాన్ గ్రామపంచాయతీ ట్రాక్టర్‌తోపాటూ రైతులకు సంబంధించిన మరో ఏడు ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. పంచాయతీ కార్యదర్శి శివకుమార్ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు.

పెన్షనర్ల అరెస్ట్


పోలీస్ స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న పెన్షనర్లు

నార్కట్‌పల్లి : పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద మౌనదీక్షకు వెళ్తున్న వారిని నార్కట్‌పల్లి వద్ద పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయినవారిలో స్పెషల్ టీచర్స్, పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పన్నాల గోపాల్‌రెడ్డి, డీవీ భాస్కర్‌రెడ్డి, అమర్, వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, తదితరులు ఉన్నారు.